

మహబూబాబాద్‌లో నిర్మించి లబ్ధిదారులకు కేటాయించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు

ఎన్నాళ్లీ నిరీక్షణ!

పేదల సొంతింటి కల నెరవెరేదెన్నడో.?

- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చారు, వసతులు మరిచారు
- మానుకోటలో అంతర్గత రోడ్లు, తాగునీటి కోసం ఇక్కట్లు
- జిల్లాలో పలుచోట్ల నిర్మాణాలు పూర్తయినా పేదలకు కేటాయించని ప్రభుత్వం
- బేస్‌మెంట్, పిల్లర్లు, స్లాబ్ లెవల్‌లో మరికొన్ని..
- గూడు కోసం కాంగ్రెస్ సర్కార్‌పై పేదల ఆశలు

మహబూబాబాద్ టౌన్, జూన్ 23 : ఇళ్లులేని నిరుపేదలు తమ సొంతింటి కల సాకారం కోసం నిరీక్షిస్తున్నారు. ఎప్పుడు నెరవేరుతుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయపార్టీలు అరచేతిలో స్వర్గం చూపుతూ.. గృహాలు మంజూరు చేస్తామని హామీలిస్తూ.. అధికారంలోకి వచ్చాక ముఖం చాటేస్తున్నారని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. తమకు అంతామేలు జరుగుతుందని భావిస్తున్న ప్రజలకు నిరాశే మిగులుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో పాలనవల్ల నష్టం జరిగిందని యావత్ ప్రజానీకం కొట్లాడి తెలంగాణ సాధించుకుంటే సొంత రాష్ట్రంలో కూడా అదేతంతు కొనసాగుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2014 జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో బీఆర్ఎస్ సర్కార్ అధికారంలోకి రాగానే ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వారి కలను సాకరం చేస్తామని పథకాన్ని రూపొందించారు. ప్రభుత్వ స్థలంలో ఒకే చోట డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి, ఏ ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర వ్యాప్తంగా 2016లో నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు.

మహబూబాబాద్ జిల్లాలో పూర్తిస్థాయి డోర్నకల్, మానుకోట, రెండేసి మండలాల ప్రాతినిధ్య పాలకుర్తి, ములుగు, ఇల్లందు నియోజకవర్గాల్లోని 18 మండలాల్లో 5,567 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేశారు. అందులో 2,503 పూర్తి కాగా, అసలు ప్రారంభించనివి 1,101, పునాది స్థాయిలో 379, స్లాబ్ పూర్తయినవి 414, వివిధ దశల్లో 1170 ఇళ్లు ఉన్నాయి. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించక పోవడం, కేటాయించిన నిధులు సరిపడక నిర్మాణాలు చేయలేమని చేతులెత్తయడంతో అక్కడక్కడ పనులు నిలిచిపోయాయి. దీంతో కొన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, మరికొన్ని వివిధ దశల్లో నిలిచిపోయాయి. 2503 ఇళ్లు పూర్తి కాగా 2155 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా అందులో 1403 మందికి ఇళ్లను కేటాయించారు. కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తయినప్పటికి అరులైన నిరుపేదలకు కేటాయించకపోవడంతో అవి శిధిలావస్థకు చేరుకుంటున్నాయి. అంతే కాకుండా అ సాంఘీక కార్యకలపాలకు అడ్డాగా మారుతున్నాయి.

మానుకోట డబుల్ ఇళ్ల వద్ద వసతుల కరువు..

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన చోట లబ్ధిదారుల కిచ్చారు. కానీ అందులో వసతులు మరి చారు. వసతుల లేమితో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 360 ఇళ్లు మంజూరు కాగా, అందులో మొదటి దశలో ప్రారంభించిన 200 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాలు నిలిచిపోయాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిరుపేదలకు కేటాయించినప్పటికి అందులో వసతులు లేకవారు ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత రోడ్లు లేక వర్షం వస్తే బురదమయంగా మారడంతో అందులో నుంచి నడుచుకుంటూ వెళ్లాల్సిన ధైన్యస్థితి. మిషన్ భగీరథ ద్వారా వచ్చేనీరు సరిపోక పోవడంతో వేసవి కాలంలో వారి కష్టాలు అంతా ఇంతా కాదు! మినరల్ వాటర్ కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది. ఇక వీధిదీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి అయిందంటే ఆ ప్రాంతం అంధకారంగా మారిపోతోంది. వర్షాలు, గాలి దుమారం వచ్చిన సమయంలో ఇళ్లలో సైతం కరెంటు పోతే భయంతో వణికిపోతున్నారు. వారికి సమీపంలోనే వైకుంఠధామం ఉండడంతో భయ కంపితులవుతున్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల చుట్టూ కనీసం ప్రహరీగోడ కూడ లేకపోవడంతో పందులు, కుక్కలు లోనికి వస్తున్నాయి.



మహబూబాబాద్‌లో బేస్‌మెంట్ లెవల్‌లో నిలిచిపోయిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు

కాంగ్రెస్ సర్కార్‌పైనే పేదల కోటి ఆశలు...

ఇళ్లు లేని నిరుపేదలంతా కాంగ్రెస్ ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. గత బీఆర్ఎస్ పదేళ్ల కాలం లో జిల్లా వ్యాప్తంగా 1,403 మంది ఇళ్లను మాత్రమే లబ్ధిదారులకు కేటాయించడంతో ఇళ్లు లేని నిరుపేదలు సొంతింటి కల నెరవేరలేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చేర్చింది. తాము అధికారంలోకి వస్తే సొంత స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం రూ. 5లక్షలు ఇస్తామని ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్నిరాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి సంవత్సరానికి 3500 ఇళ్లు కేటాయించారు. వాటిపైనే ఇళ్లు లేని నిరుపేదలు ఆశలు పెట్టుకున్నారు.

నిర్మాణాలు పూర్తయిన కేటాయింపులేవి?

జిల్లాలోని వివిధ మండలాల్లో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు నిర్మాణాలు పూర్తయినప్పటికి అవి పేదలకు కేటాయించకపోవడంతో అవి నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారుతున్నాయి. ఏజెన్సీ మండలం కొత్తగూడలో పునాదులు, స్లాబ్, పిల్లర్ల దశలో నిర్మాణాలు నిలిచిపోయాయి. చిన్న గూడూరు మండల కేంద్రంలో 100 ఇళ్లు నిర్మాణాలు పూర్తయినప్పటికి వాటిని కేటాయించకపోవడంతో అలంకార ప్రాయంగా మిగిలిపోయాయి. తొర్రూరు మునిసిపల్ కేంద్రంలో సైతం 290 ఇళ్లు నిర్మించినప్పటికి అవి కూడ ఎవరికి ఇవ్వలేదు. మరిపెడ మునిసిపల్ కేంద్రంలో నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. గంగారం మండలం ముల్కనూరు, గుంపెళ్లగూడెం, బుద్ధారంతండాలో స్లాబ్‌లెవల్‌లో ఉన్నాయి. పెద్దవం గరలో ఇళ్లు పూర్తయిన కేటాయింపులు లేవు. ఇలా అక్కడక్కడ నిర్మాణాలు పూర్తయినప్పటికి అవి పేదలకు కేటాయించపోవడంతో నిరుపయోగంగా మారి పేదలకు సొంతింటి కల అందని ద్రాక్షలా మారింది.



చిన్నగూడూరు మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు

మౌళిక వసతులు కల్పించాలి

పులి శ్రావణి, డబుల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారుడు, మానుకోట



మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివార్లలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద మౌళిక వసతులు కల్పించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అంతర్గత రోడ్లు లేక వర్షం వస్తే వీధులన్ని బురదమయంగా మారుతున్నాయి. వీధి దీపాలు లేక అంధకారంలో మగ్గుతున్నాం. మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నప్పటికి అవి సరిపోక పోవడంతో నీటి కోసం తిప్పలు తప్పడం లేదు. అంతర్గత రోడ్లు నిర్మించి, వీధి దీపాలు ఏర్పాటు చేసి, తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలి..

బోయిని యాకన్న, చిన్నగూడూరు




చిన్నగూడూరు మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అర్హులైన నిరుపేదలకు కేటాయించాలి. ఇళ్ల నిర్మాణాలు పూర్తయి అనేక నెలలు గడుస్తున్నప్పటికి ఎన్నికల కోడ్ అడ్డురావడంతో వాటిని కేటాయించకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగియడంతో అర్హులైన పేదలను గుర్తించి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించి వారి సొంతింటి కలను నెరవేర్చాలి.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



కొంగరి సునిల్ (ఫైల్)

కేసముద్రం, జూన్ 23 : కేసముద్రం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో డౌన్‌లైనులో ఆదివారం ఉదయం స్థానిక కిష్టాపురానికి చెందిన కొంగరి సునిల్ (34) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన్ తెలిపారు. జీఆర్‌పీ హెచ్‌సీ తెలిపిన ప్రకారం. ఉదయం 10 గంటల ప్రాంతంలో ఆదిలాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే కృష్ణాఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి సునిల్ ఆత్మహత్య చేసుకున్నట్లు లోకోపైలెట్ జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించాడు. మృతుడికి భార్య మమతారాణి ఉన్నారు. ఆత్మహత్యకు గలకారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.



వావ్.. భీమునిపాదం

జాలువారుతున్న వాటర్‌ఫాల్స్

గూడూరు, జూన్ 23 : మండలంలోని సీతానగరం గ్రామశివారు కొమ్ములవంచ అటవీ ప్రాంతంలోని భీమునిపాదం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండపై నుంచి జాలువారుతున్న జలధార సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఇక్కడి ప్రకృతిని చూసి మంత్రముగ్ధులయ్యారు. ఆదివారం సెలవుదినం కావడంతో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు వాటర్‌ఫాల్స్ వద్ద ఆనందంగా గడిపేందుకు భారీగా వచ్చారు. సందర్శకులు తమతమ ఫోన్‌లలో సెల్ఫీలు దిగుతూ.. కొలనులో ఈత కొట్టారు. దీంతో అటవీప్రాంతం రద్దీగా మారింది. గూడూరు రేంజ్ అధికారి సురేష్, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందిని ఏర్పాటు చేశారు. వచ్చే పర్యాటకులకు సౌకర్యాల పట్ల అవగాహన కల్పించారు.

జిల్లాలో 290.2 మిల్లీమీటర్ల వర్షపాతం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 23 : జిల్లాలో శనివారం రాత్రినుంచి ఆదివారం ఉదయం వరకు చిరుజల్లుల నుంచి భారీ వర్షం కురిసింది. నర్సింహులపేట, డోర్నకల్ మండలంలో భారీ వర్షం కురియగా, నెల్లికుదురు, గూడూరు, కేసముద్రం, తొర్రూరు, చిన్నగూడూరు, మరిపెడ, గార్ల, కొత్తగూడలలో ఓ మోస్తారు వర్షం పడింది. మిగతా మండలాల్లో చిరుజల్లులతో కూడిన ముసురు కురిసింది. ఉదయం 8.30 గంటల వరకు వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడలో 15.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, గంగారం 5.6, బయ్యారం 6.6, గార్ల 14.2, డోర్నకల్ 44.0, కురవి 4.8, మహబూబాబాద్ 4.4, గూడూరు 33.0, కేసముద్రం 21.2, నెల్లికుదురు 33.8, నర్సింహులపేట 44.4, చిన్నగూడూరు 18.6, మరిపెడ 14.2, దంతాలపల్లి 2.2, తొర్రూరు 24.8, పెద్దవంగర 5.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వెరసి జిల్లా వ్యాప్తంగా 290.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రుణమాఫీపై కాంగ్రెస్ సంబరాలు

సీఎం, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం

తొర్రూరు, జూన్ 23 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం తొర్రూరు గాంధీ సెంటర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చిత్రపటాలకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. ఆరు గ్యారంటీల అమలు జరుగుతుందని, పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్నివిధాలుగాఅభివృద్ధి చేస్తానని తెలిపారు. పార్టీ నాయకులు సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, పెదగాని సోమయ్య, మెరుగు మల్లేశం, నిరంజన్ రెడ్డి, కాసర్ల రవి, వెన్నం సోమిరెడ్డి, బిజ్జాల అనిల్, దొంగరి శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

- దంతాలపల్లి : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల సీనియర్ నాయకుడు పొన్నోటి బాలాజీ మాట్లాడుతూ రూ.2 లక్షల రుణమాఫీని ఆగస్టు 15 కల్లా మాఫీ చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. ఎంపీటీసీ యాకయ్య, సతీష్, శ్రీనివాస్‌రెడ్డి, నెహ్రూ, రామకృష్ణ, వెంకన్న, వాసు తదితరులు పాల్గొన్నారు.
- పెద్దవంగర : కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ, రైతు భరోసాతోరైతుల కన్నీరుతుడుస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. పెద్దవంగరలోలో రేవంత్‌రెడ్డి, యశస్వినిరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎంపీపీ ఎర్ర సబిత వెంకన్న, పొడిశెట్టి సైదులు, ఓరుగంటి సతీష్, శ్రీనివాస్, దేవేంద్ర, రవీందర్‌రెడ్డి, నగేష్, వెంకన్న, ఉప్పలయ్య ఉపేందర్, యాకన్న, సుధాకర్, మహేష్, సందీప్, వినోద్, శ్రీనాథ్, మంజుల, లావణ్య తదితరులు పాల్గొన్నారు.
- చిన్నగూడూరు : రూ. 2 లక్షల రైతు రుణమాఫీని సీఎం, మంత్రులు కేబినెట్‌లో ఆమోదం పొందిన నేపధ్యంలోచిన్నగూడూరు, విస్సంపల్లి, ఉగ్గంపల్లిలో కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచాకాల్చి సం బరాలు జరుపుకున్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మండల ప్రధాన కార్యదర్శి నాగేష్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి సందీప్, ఉగ్గంపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు గండ్ల భద్రయ్య, ఉపాధ్యక్షుడు మేగ్యానాయక్, ఇందిరమ్మ కమిటీ నాయకులు వెంకట్య, యాకన్న, బాలు, వీరాచారి, మాజీ సర్పంచ్ మంజులరాములు, మండల యూత్ ప్రధాన కార్యదర్శి రాజు, సేవాలాల్ కమిటీ అధ్యక్షుడు జగన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రమేష్, గ్రామ కమిటీ నాయకులు శ్రీపాల్, రవి, డి.యాకన్న పాల్గొన్నారు.
- నర్సింహులపేట : రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేసేందుకు ప్రభుత్వం విధివిధానాలు వెల్లడించడంతో కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు జి.రమేష్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం రైతుల రుణాలు మాఫీచేయడం శుభ పరిణామమన్నారు. కాంగ్రెస్ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.



తొర్రూరులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి



పెద్దవంగర అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, యశస్వినిరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



దంతాలపల్లిలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



నర్సింహులపేటలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి

- హామీలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూన్ 23 : రైతుల పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి అని, అందరికి అన్నం పెట్టే అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నారని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్‌ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15 లోపు రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసేందుకు తెలంగాణ సర్కార్ ప్రణాళికలు సిద్ధం చేసిందని చెప్పారు. తద్వారా రాష్ట్రంలో 47 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరు తుందని చెప్పారు. తెలంగాణ ప్రభు త్వంపై రూ.31 వేల కోట్ల ఆర్థికభారం పడుతున్నప్పటికి రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఇచ్చిన మాటకు కట్టుబడి రుణమాఫీ హామీని అమలు చేస్తున్నారని చెప్పారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత కాంగ్రెస్ సర్కార్‌దని చెప్పారు. తెలంగాణలో ప్రజా పాలన కొనసాగుతోందని, మిగిలిన హామీల అమలుకు కసరత్తు చేస్తున్నారని తెలిపారు. రైతు రుణమాఫీ నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు రైతుల తరపున మురళీనాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

వందరోజుల్లో 35 వేల ఉద్యోగాలు..

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే 35 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని భూక్య మురళీనాయక్ అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఉద్యోగాల నోటిఫికేషన్‌లు ఇచ్చి పేపర్ లీక్‌చేసి పరీక్షలు రద్దుచేసి ఉద్యోగాలు ఇవ్వకుండా కాలం వెల్లబుచ్చారని విమర్శించారు. రాష్ట్ర ఖజానాను కూడా ఖాళీ చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వ చ్చాక నిధులను సక్రమంగా ఖర్చుచేస్తూ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దాదాపు మూడు నెలలపాటు కోడ్ అమలులో ఉండి అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని ఇక పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్‌పాషా, డీసీసీ ఉపాధ్యక్షుడు నీరుటి లక్ష్మీనారాయణ, మాజీ జడ్పీటీసీ జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, నాయకులుఎడ్ల రమేష్, బండారు వెంకన్న, ప్రభాకర్, బెల్లం కొండ శ్రీనివాస్, నీరుటి సురేష్ నాయుడు, భూక్య శ్రీను పాల్గొన్నారు.

ఊరూరా శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



మానుకోటలోశ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడువెంకటేశ్వర్‌రావు

మహబూబాబాద్ రూరల్, జూన్ 22 : మానుకోటలోని బీజేపీ కార్యాలయంలో అఖండ భారత స్వాప్నికుడు, బీజేపీ పూర్వపు జనసంఘ్ వ్యవస్థాపకుడు, దివంగత శ్రీశ్యాం ప్రసాద్‌ముఖర్జీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీకి శ్యాంప్రసాద్‌ముఖర్జీ సేవలు వెలకట్టలేనివని చెప్పారు. మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, ఇందుభారతి, మల్లం యశ్వంత్, తరంజిత్‌రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ముఖర్జీ స్ఫూర్తి ప్రధాత..

తొర్రూరు : బీజేపీ పూర్వపు జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు దివంగత శ్యాం ప్రసాద్ ముఖర్జీ గొప్ప దేశభక్తుడని బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్ అన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖండ భారత్ స్వాప్నికుడు, జమ్మూ కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, 370 ఆర్టికల్‌ను రద్దు చేయాలని పోరాటం చేసి కశ్మీర్ కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్పదేశ భక్తుడని కొనియాడారు. ప్రధాని మోడీ ఆర్టికల్ 370ని రద్దుచేసి కల్లోల కశ్మీర్‌లో శాంతిని పునరుద్ధరించి శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనాగించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లె కుమార్, రాజేష్, భరత్, విజయ్, నవీన్, సంతోష్, సందీప్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆశయాలను కొనసాగించాలి..

గూడూరు : స్వర్గీయ డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్ అన్నారు. గూడూరులో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేరుగు మల్లయ్య, చెల్పూరి శ్రీశైలం, పాడల నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలి

అసెంబ్లీలో తీర్మానం చేయాలి : ఇఫ్టూ జాతీయ అధ్యక్షుడు సాధినేని వెంకటేశ్వర్‌రావు

మహబూబాబాద్ రూరల్, జూన్ 23 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌లను వ్యతిరేకించి, అసెంబ్లీలో తీర్మానం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) జాతీయ అధ్యక్షుడు సాధినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. మహబూబాబాద్‌లోని ముదిరాజ్ భవన్‌లో ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనురాధ అధ్యక్షతన రాష్ట్ర సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఉన్న 142 కోట్ల మందిలో 80 కోట్ల మంది కార్మికులుగా పని చేస్తున్నారని, వారి ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించిన 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. దేశ కార్మిక వర్గాన్ని ఇనుప సంకేళ్లతో బంధించిందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి ఉరితాళ్లుగా మారనున్నందున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమల్లోకి తీసుకువచ్చారని, యూనియన్ పెట్టుకునే హక్కు కూడా లేకుండా చేయడంతో కార్మికులు నష్టపోయే ప్రమాదముందున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో కార్మిక సంక్షేమం, మెరుగైన వేతనాలు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం వాటిని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, జె.సీతారామయ్య, ఎండి.రాసోద్దీన్, శివ్వారపు శ్రీధర్, శివబాబు, వీరభద్రం, నాగరాజు, గంగుల దయాకర్, రాజేందర్, రామకృష్ణారావు, విశ్వనాథం, పద్మ, కొండపల్లి శ్రీనివాస్, రాము, శోభ, రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇఫ్టూ జాతీయ అధ్యక్షులు సాధినేని వెంకటేశ్వర్‌రావు



చేపల పంపిణీపై ప్రణాళికేది?

తొలకరి ప్రారంభమైనా అమలు చేయని వైనం

ప్రభుత్వ యాక్షన్ ప్లాన్ ఏదీ.. మత్స్యకారుల ఆవేదన

కాళోజీ జంక్షన్, జూన్ 23: తొలకరి ప్రారంభమైనా చేపల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం ఇంకా యాక్షన్ ప్లాన్ రూపొందించకపోవడంపై మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం మత్స్య సంపదను పెంపొందించడానికి ఉచితంగా మేలు రకం చేపపిల్లలను పంపిణీ చేస్తామని ప్రకటించింది. పంపిణీ కోసం టెండర్ నిర్వహించి బాధ్యతను కాంట్రాక్టర్‌కు అప్పగించింది. సదరు కాంట్రాక్టర్ మత్స్యకారులకు సరైన సైజులో మేలు రకం చేపపిల్లలను సరైన సమయంలో అందించకపోవడంవల్ల మత్స్యకారులకు లాభం కంటే నష్టమే ఎక్కువగా జరిగింది. జూన్, జూలై నెలల్లో సరఫరా చేయాల్సిన చేప పిల్లలను సెప్టెంబరు నెలలో సరఫరా చేయడంవల్ల చేపలు సరైనసైజులో ఎదగక మత్స్యకారులు నష్టపోయారు. అంతేగాక సంఖ్యాపరంగా తక్కువగా సరఫరా చేశారని, అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై మత్స్యకారులను దోచుకోవడంతో వారికి సరైన లబ్ధి చేకూరలేదు. గత ప్రభుత్వ విధానంతో మత్స్యకారులకు మేలు జరుగలేదని తెలిసిన ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం.. ఎలాంటి కార్యక్రమం చేపడుతే బాగుంటుందోనని నిర్ణయం తీసుకోకపోవడంతో ఆలస్యమవుతోంది. రైతుల సంక్షేమం కోసం పంటల సాగుకు రైతు బంధు పేరుతో పెట్టుబడి సహాయాన్ని నేరుగా అందించిన మాదిరిగా మత్స్యకారులకు కూడా నేరుగా పెట్టుబడిని అందిస్తే చేపలు పట్టే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుతుందని అంటున్నారు.

వర్షాకాలం ప్రారంభమై అన్ని ప్రాంతాల్లో చెరువులు, కుంటల్లోకి ఒకేసారి వర్షపు నీరు చేరదని, చెరువులు నిండిన ప్రాంతాల్లోని మత్స్యకారులు ముందుగా వెంటనే చేప పిల్లలను తామే స్వయంగా కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. సాధారణంగా చెరువుల్లో, కుంటల్లో బొచ్చె, రవు, బంగారుతీగ, మెరిగె, గడ్డిచేప రకాలు 9 నుంచి 10 నెలల కాలంలో పూర్తి సైజులో ఎదుగుతాయని, అందుకు జూన్, జూలై నెలల్లో చేప పిల్లల విత్తనాలను చెరువుల్లోకి వదిలితే వేసవి కాలం సమీపించి చెరువుల్లో నీటిమట్టం తగ్గి చేపలు పట్టడానికి అనువుగా ఉంటుందని మత్స్యకారులు అంటున్నారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంతో అవినీతికి ఆస్కారం ఉండదని మత్స్యకారులకు నేరుగా కానీ.. మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలకు గానీ డబ్బులు అందించడం వల్ల మత్స్యకారులు అభివృద్ధి చెందుతారని, ప్రభుత్వం ఈ విషయంపై ఆలోచించి తగు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మత్స్యకారులు కోరుతున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు తగు చొరవ తీసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మత్స్యకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మత్స్య బంధు అమలు చేయాలి..

మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు బుస్స మల్లేశం



రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం రైతు బంధు అమలు చేస్తున్న ప్రకారంగా మత్స్యకారుల అభివృద్ధి కోసం మత్స్య బంధును అమలు చేయాలి. మత్స్యకారులకు నేరుగా పెట్టుబడిగా ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తే అనువైన సమయంలో మేలు రకం చేప విత్తనాలను కొనుగోలు చేసేందుకు అవకాశముంటుంది. మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతమవుతారు.

తాటి చెట్టుపైనే హఠాన్మరణం

ఐనవోలు, జూన్ 23: మండలంలోని లింగమోరిగూడెం గ్రామానికి గీత కార్మికుడి బుర్ర సత్తయ్యగౌడ్(65) తాటిచెట్టుపైనే మృతిచెందాడు. సత్తయ్య వృత్తిలో భాగంగా ఆదివారం ఉదయం గ్రామ శివారులోని తాటి చెట్టు ఎక్కాడు. కిందికి దిగుతున్న క్రమంలో కాలు జారి వెనుకకు జారిపోయి వేలాడాడు. రెండు గంటల తరువాత అటుగా వెళ్లిన వారు సత్తయ్యగౌడ్‌ను చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపకశాఖ అధికారులు సమాచారం ఇచ్చారు. 60 అడుగులకు పైన ఎత్తు ఉన్న తాటిచెట్టుకు రెండు నిచ్చెనలు వేశారు. స్థానికుడైన యువకుడు మహ్మద్ గుల్‌పాషా ధైర్యం చేసి ఎక్కి పలకరించగా అప్పటికే గీత కార్మికుడు మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని తీయడానికి యువకుడు చెట్టుఎక్కి అతి కష్టంమీద కిందికి దింపాడు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని వర్ధన్నపేట మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు కేసు నమోదు చేశారు. గుండెపోటుతోనే మృతిచెందినట్లు ఒక అంచనాకు వచ్చారు. పోస్టుమార్టం రిపోర్టులో మృతికిగల కారణాలు తెలువనున్నాయి. మృతుడికి భార్య సరోజ ఇద్దరు కుమారులు, ఇద్దరు కుతుళ్లు ఉన్నారు. చెట్టుపైనే సత్తయ్య మృతిచెంది వేలాడుతూ కనిపించగా గుండె పోటు లేదా మరేదైనా అనారోగ్య కారణం అని భావిస్తున్నారు.



తాటిచెట్టుపై మృతి చెందిన సత్తయ్యగౌడ్



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మృతురాలి బంధువులు

నిందితుడి ఇంటి ఎదుట

మృతదేహంతో ధర్నా

నాగేంద్ర నగర్‌లో కాలనీలో ఉద్రిక్తత

బాలసముద్రం, జూన్ 23: వివాహేతర సంబంధం పెట్టుకున్న వాడే హత్య చేశాడని ఆరోపిస్తూ వెంకటస్వామి అనే వ్యక్తి ఇంటి ఎదుట మృతురాలి బంధువులు ధర్నా చేపట్టిన ఘటన ఆదివారం నాగేంద్రనగర్‌కాలనీలో చోటు చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. 49వ డివిజన్‌లోని నాగేంద్రనగర్ కాలనీలో నివాసముంటున్న మంజుల అనే వివాహితతో వెంకటస్వామి రెండేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత శుక్రవారం మంజులకు, వెంకటస్వామికి మధ్య గొడవచోటుచేసుకోగా, అదేరోజు రాత్రి సుమారు 11 గంటల సమయంలో మంజుల ఇంటికి చేరుకున్న వెంకటస్వామి విద్యుత్ సరఫరా నిలిపివేసి గొంతునులిమి హత్య చేశాడని సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మృతురాలి బంధువులు వెంకటస్వామి ఇంటి ఎదుట మృతదేహంతో ధర్నా చేపట్టారు. దీంతో కాలనీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకోగా ఆందోళనకారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నిందితుడిపై చర్యలు తీసుకునేంతవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకుకూర్చున్నారు. మృతురాలి కుటుంబానికి తగిన న్యాయం చేసి, నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని నచ్చజెప్పి ఆందోళనను పోలీసులు విరమింపజేశారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

బాలసముద్రం, జూన్ 23: పెరిగిన ధరలను నియంత్రిచడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నిత్యావసర వస్తువులతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ధరలు పెరిగి సామాన్యులకు మోయలేని భారంగా మారిందని అన్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు పెరిగి ఆకాశాన్నంటాయని అన్నారు. పెరిగిన ధరలను కేంద్ర ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్ర, జిల్లా నాయకులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, మునిగాల భిక్షపతి, ఓదెలు, సంతోస్, సారంగపాణి, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన భాషా పండితులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 23: దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న పండిట్ల ఉన్నతీకరణ చేసినందుకుగాను రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఎల్పీలకు పదోన్నతులు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అప్‌గ్రేడ్ కాకుండా మిగిలి ఉన్న వెయ్యి ఎల్పీలను స్కూల్‌అసిస్టెంట్ పోస్టులుగా మార్పు చేసి ఎల్పీల వ్యవస్థను పూర్తిగా రద్దుచేయాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, ప్రధానకార్యదర్శి జి. తిరుమల కాంతి కృష్ణ, కోశాధికారి శర్మ, నాయకులు హమీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీడీసీఎల్‌లో వారిదే హవా



ఉద్యోగ సంఘాల పేరుతో ఏళ్ల తరబడి ఒకే చోట తిష్ట

పోస్టింగ్స్‌లో సాధారణ ఉద్యోగులకు మొండి చేయి

ప్రతిభ ఆధారంగా పోస్టింగ్‌లు ఇవ్వాలని సీఎండీకి వినతి

హనుమకొండ టౌన్, జూన్ 23: ఎన్పీడీసీఎల్‌లోని కొంత మంది ఉద్యోగులు ఉద్యోగ సంఘం నాయకులు గా చెలామణి అవుతూ హెడ్‌క్వార్టర్‌ను వీడకుండా ఏళ్లుగా తిష్ట వేసి ఉంటున్నారని గ్రామీణ ఉద్యోగులు ఆవేదనను చెందుతున్నారు. ఎన్పీడీసీఎల్‌లో సుమారుగా 36 సంఘాలు కొనసాగుతుండగా, ప్రధానంగా 10 సంఘాలకు నాయకులుగా చెలామణి అవుతున్న వ్యక్తులు.. ఎన్పీడీసీఎల్‌లో చక్రం తిప్పుతూ తమ హవాను కొనసాగిస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. సర్కిల్ దాటి పోకుండా ఒక డివిజన్ నుంచి ఇంకొక డివిజన్‌కు లేదంటే.. కార్పొరేట్ ఆఫీసులోనే పనిచేస్తున్నారని అంటున్నారు.

నాయకులు లీలలు

ఒక సంఘానికి నాయకుడిగా ఉన్న ఉద్యోగి జేపీవోగా విద్యుత్‌శాఖలో అడుగుపెట్టి 20 ఏళ్లుగా నక్కలగుట్టలోని కార్పొరేట్ ఆఫీసు హెచ్‌ఆర్‌డీ విభాగంలో పదోన్నతులు పొందుతూ అక్కడే కొనసాగుతుండటం విస్మయానికి గురి చేస్తోంది. ఆయనతో ఏకంగా ఉద్యోగంలో చేరిన వారు ఇప్పటికే ఐదారు ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తే.. ఆయన మాత్రం అసోసియేషన్ పేరిట అక్కడే విధులు నిర్వర్తించడంపై ఉద్యోగులు అహహనం వ్యక్తం చేస్తున్నారు. ఈయనే కాకుండా ముగ్గురు డీఈలు, ఒక్క ఏడీఈ, కొంతమంది ట్రేడ్ యూనియన్ నాయకులు సైతం ఎన్పీడీసీఎల్‌లో ఇదే తరహాలో తమ అధిపత్యాన్ని కొనసాగిసున్నారు. గతంలో ఒక సంఘ నాయకుడి కోసం హనుమకొండ సర్కిల్‌లో ఏకంగా కొత్తగా ఒక సబ్ డివిజన్‌ను సృష్టించి ఏడీఈగా పోస్టింగ్ ఇచ్చారనే విమర్శలు వచ్చాయి. సదరు ఏడీఈ 40 ఏళ్లుగా హనుమకొండను వదలకుండా ఉంటున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితో ఉద్యోగంలో చేరినవారంతా ఎన్పీడీసీఎల్‌లోని వివిధ ప్రాంతాలకు బదిలీ అవుతుంటే.. వీరు మాత్రం ఏళ్లుగా హనుమకొండ కేంద్రంగా తిష్టవేసి ఉంటున్నారు.

బదిలీలకు శ్రీకారం

ఇప్పటికే ఆలస్యమైన బదిలీలు ప్రక్రియను ఎన్పీడీసీఎల్ త్వరలోనే చేపట్టబోతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో బదిలీల్లో ఇంతకాలం చక్రం తిప్పిన వ్యక్తులందరినీ గుర్తించి ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని సీఎండీని ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు వేడుకుంటున్నారు. నిబంధనల ప్రకారం మూడేళ్లకు మించి ఒకే చోట ఉన్న ఉద్యోగులను బదిలీ చేస్తేనే పోస్టింగ్ కోసం ఎదురుచూసే వారికి న్యాయం జరుగుతుందని ఉద్యోగస్తులు పేర్కొంటున్నారు. ఏడీఈ, పైస్థాయి అధికారులను బదిలీలు చేసి కొత్తవారికి అవకాశం కల్పించాలని పలువురు పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు.

సంస్థను శాసిస్తున్న నాయకులు

ఎన్పీడీసీఎల్‌లో సంఘాల పెత్తనంతో కొంతమంది ఉద్యోగులు నలిగిపోతున్నారని తెలుస్తోంది. పరస్పరంగా ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటూ మధ్యలో ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తమ మాట వినకపోతే, తమ దారికి రాకపోతే విచారణల పేరిట భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఉద్యోగులు వారి ఉన్నతాధికారి కంటే ఉద్యోగ సంఘ నాయకులకు భయపడాల్సిన పరిస్థితి ఉందని ఉద్యోగులు అంటున్నారు. అయితే ఇంకొంత మంది ఉద్యోగులు మాత్రం ఉద్యోగ సంఘాల నాయకుల సేవలో తరిస్తూ వారి పనులను చక్కదిద్దుకుంటున్నారని తెలుస్తోంది. ప్రధానంగా ఉద్యోగుల నుంచి వేలల్లో డబ్బులు తీసుకొని అసోసియేషన్ పేరిట పోస్టింగ్‌లు ఇప్పించారనే ఆరోపణలు సైతం వినబడుతున్నాయి. ఇప్పటికైనా సీఎండీ ఉద్యోగ సంఘాల అధిపత్యాన్ని తగ్గించి త్వరలో జరగబోయే బదిలీల్లో ప్రతిభ ఆధారంగా పోస్టింగ్‌లు ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఉప కులపతికి అర్హతల సడలింపు

వరంగల్ మెడికల్, జూన్ 23: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి పదవి కోసం అర్హతలలో సడలింపులు కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అనుబంధ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హులైన వారు జూన్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. వైద్యరంగంలో కొత్త ఆవిష్కరణలు, పరిశోధనలు, రచనలు చేసిన వైద్యులు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. వైద్య బోధన, అకడమిక్, అడ్మినిస్ట్రేషన్‌లో అనుభవం ఉన్న వారు కూడా అర్హులని పేర్కొంది. జాతీయ వైద్య విద్యా విధానంపై అవగాహన ఉన్న అధ్యాపకులు కూడా దరఖాస్తు చేసుకునే వెసలుబాటు కలిగింది. వైద్య విద్య ప్రవేశాలలో అక్రమాలు జరగకుండా సమర్థవంతమైన ఉప కులపతిని నియమించాలని ప్రభుత్వం కూడా యోచిస్తున్నట్లు సమాచారం. తొలి నోటిఫికేషన్‌లో ఉన్న ఇబ్బందులను వైద్య కళాశాలలో పని చేస్తున్న ప్రొఫెసర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం అనుబంధ నోటిఫికేషన్ జారీ చేసింది.

28న డీసీసీబీ మహాజన సభ

హనుమకొండ సిటీ, జూన్ 23: వరంగల్ ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజన సభ ఈ నెల 28న నిర్వహించనున్నట్లు బ్యాంకు కార్య నిర్వహణ అధికారి ఎం.డి. వజీర్ సుల్తాన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉదయం 11గంటలకు సభ ప్రారంభం కానుంది. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అధ్యక్షతన సభ జరుగనుంది. పీఏసీఎస్ చైర్మన్లు, సహకార సంఘాల చైర్మన్లు తదితరులు సభకు హాజరుకావాలని వజీర్ సుల్తాన్ కోరారు.

గ్రీన్ బావర్చి బిర్యానీలో బొద్దింక

మునిసిపల్ అధికారులకు బాధితుడి ఫిర్యాదు.. జరిమానా

వరంగల్ కార్పొరేషన్, జూన్ 23: హనుమకొండ అశోకజంక్షన్ సమీపంలోని గ్రీన్ బావర్చి హోటల్‌లో శనివారం ఓ విద్యార్థి తీసుకున్న బిర్యానీలో బొద్దింక కళేబరం వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ కుమార్‌పల్లికి చెందిన గణేశ్ అనే విద్యార్థి.. శనివారం గ్రీన్‌బావర్చి బిర్యానీ సెంటర్‌కు వెళ్లి ఒక బిర్యానీ పార్సిల్ తీసుకుని ఇంటికి వెళ్లాడు. తన సోదరుడితో కలిసి బిర్యానీ ప్యాకెట్ విప్పి సగం వరకు తిన్నారు. మధ్యలో కుళ్లిపోయిన బొద్దింక కనిపించడంతో ఖంగుతున్నారు. ఒక్కసారిగా వాంతులు చేసుకున్నారు. వెంటనే వారి వద్ద మిగిలిన బిర్యానీ తీసుకుని హోటల్ వద్దకు వెళ్లి నిర్వాహకులకు చూపించి నిలదీశారు. వెంటనే హోటల్ యజమాని వెనక్కి తగ్గి విషయాన్ని ఇంతటితో ఆపేయాలని బుజ్జగించి మరో రెండు బిర్యానీలు ఇస్తానని చెప్పుకొచ్చాడు. అయినా బాధితులు వెనక్కి తగ్గకుండా విషయాన్ని మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సాయంత్రం బల్దియా శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తన సిబ్బందితో కలిసి వెళ్లి వంటగదిలో తనిఖీలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో హోటల్ యజమానులను హెచ్చరించి రూ.2వేల జరిమానా విధించినట్టు వెల్లడించారు.



6 నుంచి సీపీ గేట్-24 ప్రవేశాల పరీక్షలు

జూలై 3 నుంచి హాల్‌టికెట్ల జారీ ● అన్ని జిల్లా కేంద్రాల్లో ఆన్‌లైన్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూన్ 23: రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల్లో రెగ్యులర్ ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ ఇతర పీజీ కోర్సుల్లో డ్మిషన్ల కోసం నిర్వహించే సీపీ గేట్ - 2024 ప్రవేశాల పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు సీపీ గేట్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి ప్రవేశాల పరీక్షలు జూలై 6 నుంచి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం రోజుకు మూడుసెషన్లలో నిర్వహించనున్నట్లు షెడ్యూల్‌ను వెలువరించారు. రాష్ట్రంలోని వర్సిటీల్లో దాదాపు 78 కోర్సుల్లో సీపీగేట్ ప్రవేశాల పరీక్షల మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా సీట్లును కేటాయిస్తారు.

సీపీగేట్ పరీక్షల షెడ్యూల్ ఇదే..

ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 1 నుంచి 2.30 గంటల వరకు రెండో సెషన్, సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు మూడో సెషన్‌లోపరీక్షలు జరుగుతాయి.

- జూలై 6న మొదటి సెషన్‌లో ఎకానమిక్స్ రెండో సెషన్‌లో తెలుగు, మూడో సెషన్ లో సైకాలజీ, డేటాసైన్స్
- జూలై 7న మొదటి సెషన్‌లో జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, రెండో సెషన్‌లో ఎంఈడీ, ఎంపీఈడీ, లైబ్రరీసైన్స్ (ఏడాది, రెండేళ్లు), మూడో సెషన్‌లో మాస్టర్ ఆఫ్ టూరిజం మేనేజ్‌మెంట్, జియో ఇన్ఫాటిక్స్
- జూలై 8న మొదటి సెషన్‌లో పొలిటికల్ సైన్స్, రెండో సెషన్‌లో లైబ్రరీ సైన్స్ (ఏడాది, రెండేళ్లు), మూడో సెషన్‌లో జియోగ్రఫీ
- జూలై 9న మొదటి సెషన్‌లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రెండో సెషన్‌లో హిందీ, సంస్కృతం, మూడో సెషన్‌లో ఫిలాసఫీ, జియాలజీ.
- జూలై 11న మొదటి సెషన్‌లో ఇంగ్లీష్, రెండో సెషన్‌లో బయోటెక్నాలజీ (ఐదేళ్లు), మూడో సెషన్‌లో ఎంబీఏ, (ఐదేళ్లు), లింగ్విస్టిక్స్
- జూలై 12న మొదటి సెషన్‌లో హిస్టరీ, కెమిస్ట్రీ, రెండో సెషన్‌లో కంప్యూటర్ సైన్స్, బీసీఈఎస్ఎఫ్ఎస్ఎఫ్‌టీజీఅండ్ఎం, మూడో సెషన్‌లో కెమిస్ట్రీ, ఫార్మా కెమిస్ట్రీ (ఐదేళ్లు).
- జూలై 13న మొదటి సెషన్‌లో ఎంఏ సైకాలజీ, బయోటెక్నాలజీ, ఎంఏ ఎకానమిక్స్ (ఐదేళ్లు) రెండో సెషన్‌లో మ్యాథమెటిక్స్, మూడో సెషన్‌లో సోషియాలజీ.
- జూలై 15న మొదటి సెషన్‌లో ఎంకామ్, బాటనీ, రెండో సెషన్‌లో స్టాటస్టిక్స్, న్యూట్రీషియన్, డెయిట్, మూడో సెషన్‌లో మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (ఎంహెచ్‌ఆర్ఎం).

ఎంఏ అరబిక్, కన్నడ, మరాఠీ, పర్షియన్, థియేటర్ ఆర్ట్స్ ఎంఎస్సీ ఎలక్ట్రానిక్స్ సబ్జెక్టుల్లో ప్రవేశాల పరీక్షలుండవు. డిగ్రీ మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో ప్రవేశాల పరీక్షల కోసం సెంటర్ల ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ఎక్కువగా ఉన్న సెంటర్లల్లో కొందరికీ పక్క సెంటర్లలో పరీక్షలను ఏర్పాటు చేశారు.

దరఖాస్తుల్లో తప్పులను సరిచూసుకోవాలి..

ప్రొఫెసర్ పాండురంగారెడ్డి కన్వీనర్ సీపీగేట్

అభ్యర్థులు దరఖాస్తుల చేసేక్రమంలో కొందరూ అర్హతలేని సబ్జెక్టులకు దరఖాస్తులు చేశారు. పేర్లల్లో, పుట్టిన తేదీల్లోనూ తప్పులు దొర్లాయి. తప్పులున్న అభ్యర్థులందరికీ ఇప్పటికే వారిచ్చిన ఫోన్‌నెంబర్లకు ఎస్ఎంఎస్‌లు చేరవేశాం. వీలైనంత త్వరగా వెబ్‌సైట్ https://cpget.tsche.ac.in/ లోకి వెళ్లి అభ్యర్థులు తమ దరఖాస్తుల్లో చోటుచేసుకున్న తప్పులను సరిచేసుకోవాలి. జూలై 3 నుంచి హాల్‌టికెట్లను విడుదల చేస్తాం. కౌన్సెలింగ్ వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా అర్హులైన అభ్యర్థులందరూ తాజా కులం, ఆదాయం, ఇతర ధ్రువపత్రాలన్ని సమకూర్చుకోవాలి. ఆదాయం ధ్రువపత్రాలులేని అభ్యర్థులకు ఓపెన్ ఫీజులు వసూలు చేస్తాం. ఫీజు చెల్లించేనాటికి ఆదాయ ధ్రువపత్రాన్ని సమకూర్చుకోవాలి.

ఉపాధ్యాయుల బదిలీలకు వేళాయే..

ఖాళీల జాబితాలు, సీనియారిటీ జాబితాలను రూపొందించిన విద్యాశాఖ

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 23: ఉపాధ్యాయుల బదిలీలకు రంగం సిద్ధం అవుతోంది. ఎస్జీటీ, తత్సమాన విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన సీనియారిటీ జాబితాలను అధికారులు రూపొందించి సంబంధిత వెబ్‌సైట్లలో పొందుపరిచారు. క్లియర్ వేకెన్సీలతో పాటు 8 యేళ్లు దాటిన వారిని కలిసి ఖాళీల జాబితాలను అధికారులు రూపొందించారు. అయితే ఉపాధ్యాయులు మాత్రం రెండు జిల్లాల్లో ఉన్న అన్ని ఖాళీలను జాబితాల్లో పొందుపరచాలని డిమాండ్ చేస్తున్నారు. పదోన్నతుల ప్రక్రియలో రూపొందించిన జాబితాల్లో పొరపాట్లు దొర్లిన నేపథ్యంలో కొంతమంది ఉపాధ్యాయులు నష్టపోయారని, బదిలీల్లో అలా జరుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. వరంగల్ జిల్లాలో బదిలీల కోసం అన్ని కేటగిరీల్లో కలిపి 715 ఖాళీలు ఏర్పడగా, హనుమకొండ జిల్లాలో 448 ఖాళీలతో అధికారులు జాబితాలను రూపొందించారు.

వెబ్ ఆప్షన్ల ఎంపిక తర్వాత బదిలీలు షురూ..

వరంగల్, హనుమకొండ జిల్లాల విద్యాశాఖాధికారులు బదిలీలకు సంబంధించిన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో ఉన్న ఖాళీలను సంబంధిత మండల విద్యాధికారుల పర్యవేక్షణలో ఖాళీలను గుర్తించి జాబితాలను రూపొందించారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీనియారిటీ జాబితాలను, ఖాళీల జాబితాలను రూపొందించి జిల్లా విద్యాశాఖ వెబ్ పోర్టల్‌లో పొందుపరిచినట్లు అధికారులు పేర్కొన్నారు. రెండు రోజుల్లో బదిలీల కోసం ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆ తర్వాత వెనువెంటనే బదిలీల ఉత్తర్వులు జారీ కానున్నాయి.

వరంగల్ జిల్లాలో బదిలీలకు ఖాళీలు ఇలా..

లోకల్ బాడీ పాఠశాలల్లో..

కేటగిరి	ఖాళీలు	5/8 యేళ్లు దాటిన ఖాళీలు
ఆర్ట్/డ్రాయింగ్ టీచర్స్	5	0
క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్స్	6	0
లాంగ్వేజ్ పండిట్ (తెలుగు)	12	0
లాంగ్వేజ్ పండిట్ (హిందీ)	11	0
పీఈటీలు	10	0
ఎస్జీటీలు	294	239
వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్	0	3
మొత్తం	**341**	**239**

ప్రభుత్వ పాఠశాలల్లో..

కేటగిరి	ఖాళీలు	5/8 యేళ్లు దాటిన ఖాళీలు
క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్స్	2	0
లాంగ్వేజ్ పండిట్ (తెలుగు)	1	0
లాంగ్వేజ్ పండిట్ (హిందీ)	1	0
ఎస్జీటీలు	46	85
మొత్తం	50	85

కేటగిరీల వారిగా మొత్తం ఖాళీలు - 715

హనుమకొండ జిల్లాలో బదిలీలకు ఖాళీలు ఇలా..

లోకల్ బాడీ పాఠశాలల్లో...

కేటగిరి	ఖాళీలు	8 యేళ్ల ఖాళీలు
ఎస్జీటీ (తె.మీ.)	198	111
ఎస్జీటీ (ఉ.మీ.)	1	5
లాంగ్వేజ్ పండిట్ (తెలుగు)	5	0
లాంగ్వేజ్ పండిట్ (హిందీ)	11	0
పీఈటీలు	10	0
క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్స్	10	0
వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్	4	0
డ్రాయింగ్ టీచర్స్	7	0
మొత్తం	246	116

ప్రభుత్వ పాఠశాలల్లో...

కేటగిరి	ఖాళీలు	8 యేళ్ల ఖాళీలు
ఎస్జీటీ (తె.మీ.)	35	26
ఎస్జీటీ (ఉ.మీ.)	12	2
పీఈటీలు	1	0
క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్స్	7	0
డ్రాయింగ్ టీచర్స్	2	0
మ్యూజిక్ టీచర్	0	1
మొత్తం	57	29

కేటగిరీల వారిగా మొత్తం ఖాళీలు. - 448

తెలంగాణ ఫిషరీస్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా గొడుగు శ్రీనివాస్



నియామకపత్రం అందుకుంటున్న గొడుగు శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, జూన్ 23 : తెలంగాణ ఫిషరీస్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గొడుగు శ్రీనివాస్ నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో తెలంగాణ ఫిషరీస్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆదివారం ప్రకటించి, శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందించారు. ప్రస్తుతం తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న శ్రీనివాస్ 1990 నుంచి ముదిరాజ్ సామాజికవర్గం సమస్యలపై పోరాడుతూ మత్స్యకారుల హక్కులను కాపాడడంతో ముందు వరుసలో నిలుస్తూ వస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ముదిరాజ్ సామాజికవర్గ సమావేశాలు ఏర్పాటు చేసి కాంగ్రెస్ గెలుపు కోసం క్రియాశీలకంగా పని చేశారు. ఆయన సేవలను గుర్తించిన అధిష్ఠానం తెలంగాణ ఫిషరీస్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

మానుకోట వేదికగా తెలంగాణ

నవనిర్మాణ సభ ఆవిష్కృతం



మాట్లాడుతున్న విద్యావేత్త దోలి సత్యనారాయణ

మహబూబాబాద్ టౌన్, జూన్ 23 : పోరాటాల ఖిల్లా మానుకోట వేదికగా 'తెలంగాణ నవనిర్మాణ సభ ' ఆదివారం ఆవిష్కృతమైంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మేధావులు, విద్యావేత్తలు, వివిధ సంఘాల ప్రతినిధుల సమక్షంలో తెలంగాణ నవనిర్మాణ సభ పేరుతో మరో తెలంగాణ ఉద్యమ సంస్థ ఆవిర్భవించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, విద్యావేత్త దోలి సత్యనారాయణ మాట్లాడారు. తెలంగాణలో సామాజిక న్యాయం ద్వారానే ప్రజలకు మేలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఆరు దశాబ్దాల ఉద్యమం తర్వాత ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు మేలు జరిగిందేమి లేదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన లక్ష్యంగా తెలంగాణ సాధన కోసం అనేక మంది బలిదానాలు చేశారని గుర్తు చేశారు. సాధించుకున్న తెలంగాణలో పాలకుల తీరుతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ లక్ష్యంతో స్వరాష్ట్ర ఉద్యమం మొదలైందో రాష్ట్రం ఏర్పడ్డాక ఆ లక్ష్యం నెరవేరలేదన్నారు. సామాజిక తెలంగాణ సాధనే ఏజెండాగా తెలంగాణ నవనిర్మాణ సభ ఆవిర్భవించిందని చెప్పారు. అనంతరం తెలంగాణ నవనిర్మాణ సభ కన్వీనర్‌గా కొమిర వెంకన్న, కో-కన్వీనర్‌గా కల్తీ వీరస్వామితో పాటు తొమ్మిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కన్వీనర్ కొమిర వెంకన్న మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, అణగారిన వర్గాలంతా ఒక్కతాటిపైకి వచ్చి రాజ్యాధికారమే లక్ష్యంగా సామాజిక న్యాయం కోసం సమరశంఖం పూరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు ఎల్.వెంకన్న, చుంచు శ్రీశైలం, విశ్వ, వసంతరావు, ఈర్ల సాగర్, జగన్మోహన్, కవిత పాల్గొన్నారు.

ఆర్ఐల అక్రమ వసూళ్లు

బల్దియాలో కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల చేతి వాటం ● బిల్ కలెక్టర్లతో ప్రతీ పనికి వసూళ్లు ● కమిషనర్ దృష్టి సారించాలంటున్న ప్రజలు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 23: వరంగల్ బల్దియాలో కొందరు ఆర్ఐలు రాజ్యమేలుతున్నారు. ప్రతీ పనికి ఒక రేటు పెట్టి బిల్ కలెక్టర్ల ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. 66 డివిజన్‌లలో ప్రజలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అర్జీలను పరిశీలించి పనులు చేయాల్సిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు.. వారి వద్ద పని చేస్తున్న బిల్‌కలెక్టర్లు, కొత్తగా నియమింపబడ్డ వార్డు ఆఫీసర్‌లను పావులుగా చేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు.

విధులు


వరంగల్ మహానగర పాలక సంస్థలో 10 మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పని చేస్తుంటారు. వారి వద్ద డివిజన్‌ల పరిధిని బట్టి 5 నుంచి 8 మంది బిల్‌కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లు పని చేస్తున్నారు. ప్రస్తుతం నగరంలో 66మంది బిల్‌కలెక్టర్లు పని చేస్తుండగా, ఇటీవల కొత్తగా కార్పొరేషన్‌కు కేటాయించిన వీఆర్ఏలు, వీఆర్వోలు మరో 40మందిని వార్డ్ ఆఫీసర్లుగా నియమించారు. యజమాని ఇంటి పేరు మార్పు, భైఫర్‌కేషన్, కొత్త ఇంటి నెంబర్ల జారీ, వీఎల్‌టీ (వెకెట్ ల్యాండ్ ట్యాక్సీ), వృద్ధాప్య, వితంతు, చేనేత, బీడీకార్మికులు, గీతకార్మికుల పింఛన్‌తో పాటు తదితర దరఖాస్తులను పరిశీలించి అనుమతి పత్రాలు జారీ చేయాలి. ఇందుకుగాను నగర ప్రజలు ఆన్‌లైన్ ద్వారా వారికి అవసరం ఉన్న పనిని బట్టి చలనా ద్వారా డబ్బులు చెల్లిస్తారు.

డబ్బుల వసూళ్లు

పనుల కోసం కొందరు ఆర్ఐలు కొత్తరకం దందా మొదలు పెట్టారు. ప్రజల నుంచి వసూళ్ల కోసం బిల్ కలెక్టర్లను రంగంలోకి దించుతున్నారు. బిల్‌కలెక్టర్లు దరఖాస్తుదారులకు నేరుగా ఫోన్ చేస్తున్నారు. 'దరఖాస్తులో తప్పులున్నాయి.. డాక్యుమెంట్లు సరిగా లేవు.. హద్దులు సరిగా లేవు.. రోడ్డు విడ్త్ సరిగా లేదు.. కుటుంబ సభ్యుల నుంచి ఎన్‌వోసీ తేవాలి..' అని కొర్రీలు పెట్టి దరఖాస్తు రద్దు చేస్తున్నారు. తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. ఇలా డబ్బులు ఇచ్చే వరకు పట్టి పీడిస్తున్నారు. ఇలా.. ఇంటి నెంబర్‌కు కనీసం రూ.2లక్షలు వసూలు చేస్తుండగా, మిగతా పనులకు పనిని బట్టి వేలల్లో వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

పని గురించి అడిగితే బెదిరింపులు

కొందరు వివిధపనుల కోసం ప్రజలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే.. రోజులు గడుస్తున్నా పనులు పూర్తికావడం లేదు. గత పదిరోజుల్లో 170 దరఖాస్తులు రాగా, ఒక్క పని చేయలేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు. దీంతో ఆర్ఐ, బిల్ కలెక్టర్లకు ఫోన్ చేసి బతిమిలాడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. కొందరైతే డబ్బులు చెల్లించిన తర్వాత కూడా పనిలో జాప్యం చేస్తున్నారని అంటున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. మాది కంచరకుంట, లష్కర్‌సింగారం, పెద్దమ్మగడ్డ.. అని చెబుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నట్టు వాపోతున్నారు. కొందరు బాధితులు ఓ బిల్‌కలెక్టర్ వద్దకు వెళ్లి ప్రశ్నించగా, తల్వార్ చూపించి బెదిరించినట్టు తెలిసింది. దీనిపై కమిషనర్ దృష్టిసారించి అవినీతి ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులను గుర్తించి శాఖాపరమైన వేటు వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మచ్చుకు కొన్ని..

- ఇటీవల దేశాయిపేటకు చెందిన ఓ మహిళ.. ఇంటి నెంబరు కోసం దరఖాస్తు చేసుకోగా, రూ.20వేలు ఫోన్‌పే చేయించుకుని ఇంటి నెంబర్ ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నట్టు బాధితురాలు వాపోయింది.
- వరంగల్ బట్టలబజార్‌లో అన్నదమ్ముల ఆస్తుల భైఫర్‌కేషన్ పత్రాలకు ఓ ఆర్ఐ ఏకంగా రూ.10లక్షలు డిమాండ్ చేసి రూ.6లక్షలు పుచ్చుకున్నట్టు తెలిసింది.
- న్యూశాయంపేటలో ఓ మహిళా ఆర్ఐ ఒకే ఇంటికి రెండు నెంబర్లు జారీ చేసి తలపట్టుకుంది.
- వంగపహాడ్ గ్రామంలో ఓ ఆర్ఐ లేని ఇళ్లకు ఇంటి నెంబర్లు జారీ చేసి కోట్లు గడించినట్లు సమాచారం.



కేసముద్రంలో సమావేశమైన 1997-98 టెన్త్‌బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కేసముద్రం, జూన్ 23 : కేసముద్రం స్టేషన్ జడ్పీహైస్కూల్ 1997-98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సమావేశాన్ని స్థానిక హరిహర గార్డెన్స్‌లో నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులైన రంగాచారి, రాజవీరు, రావుల ఉపేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, కృష్ణమూర్తి, అజీద్‌ఖాన్, రాజవీరు, నమ్మాళ్వార్, లక్ష్మారెడ్డిలను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఆ బ్యాచ్ విద్యార్థులు చిలువేరు సమ్మయ్యగౌడ్, బొల్లెద్దు చందర్, బోడ రవి, బండారు బ్రహ్మం, జూకంటి అశోక్, కొక్కెరబోయిన లక్ష్మణ్, శాగంటి రాములు, గొట్టం సుభాష్, లక్ష్మణ్, సతీష్, ఎస్‌కె.జాని, పబ్బతి సారంగంగౌడ్, అల్లి అశోక్, కంచ కట్టయ్య, గాడిపల్లి వెంకన్న, పెద్ది విజేందర్, పులిగిల్ల కిరణ్, పాషా పాల్గొన్నారు.

1982-83 ఎస్ఎస్‌సీ బ్యాచ్..

● కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్ '1982-83 ఎస్ఎస్‌సీ పూర్వవిద్యార్థుల సంఘం' సమావేశాన్ని స్థానిక గణపతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా తమ తల్లిదండ్రులను పిలుచుకొని శాలువాలతో సత్కరించారు. అనంతరం తమ పాఠశాల జ్ఞాపకాలను చిన్ననాటి స్నేహితులతో నెమరు వేసుకున్నారు. సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయించి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు మచ్చ అయిలయ్య తెలిపారు. పూర్వ విద్యార్థులు చౌళ అమరేందర్, పొలెపల్లి సంజీవరెడ్డి, పాల్వాయి రమాదేవి, మంచన మనోహర్, ఉప్పుల ఏకాంతం, గంధం శ్రీనివాస్, బొల్లోజు రాంమోహన్‌చారి, రుద్ర ఉమారాణి, దళ్వాయి నిర్మల, సంపంగి బేబిసరోజన, ఇదే బ్యాచ్‌కు చెందిన టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, వేలం శ్రీనివాస్, బండారపు రమేష్ పాల్గొన్నారు.



కేసముద్రంలో సమావేశమైన 1982-83 ఎస్ఎస్‌సీ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు

కురవి జడ్పీహెచ్ఎస్‌లో..

కురవి, జూన్ 23 : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో 1996-97 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ రోజుల్లో తమకు చదువులు చెప్పిన గురువులను పిలిపించి ఘనంగా సన్మానించారు. పాతతరగతి గదుల్లో తాము ఎక్కడెక్కడ కూర్చునేవాళ్లమో ఆ స్థానంలో కూర్చుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. నాటి గురువులు నారాయణరావు, సత్యనారాయణ, మందుల శ్రీరాములు, జలజ, జానికిరాములు, జనార్ధన్‌లను సన్మానించారు. పూర్వ విద్యార్థులు రచ్చ వీరన్న, షేక్.ఆలీ, కళ్ల దామోదర్‌రెడ్డి, నూతక్కి ప్రమోద్, తేనే నాగరాజు, ఆమెడ రమేష్, రాజు, కాకి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



కురవిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 1996-97 పదో తరగతి బ్యాచ్

పురుగుల మందుతాగిన మహిళ మృతి

డోర్నకల్, జూన్ 23 : కొడుకు, కోడలు మందలించినందుకు పురుగుల మందుతాగి చికిత్స పొందుతున్న మహిళ ఆదివారం మృతి చెందినట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. తహసీల్దార్ బంజరకు చెందిన సామల విజయలక్ష్మి (54)కి ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కొడుకు శ్రీకాంత్, కోడలు నాగమణి తనను సరిగ్గా చూడడంలేదని ఈనెల 20న డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు చిన్నకొడుకు, కోడలుకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో ఇంటికి వెళ్లిన తర్వాత పోలీస్‌స్టేషన్ దాక మమ్ముల్ని పిలిపిస్తావా అంటూ తల్లి విజయలక్ష్మిని కొడుకు మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన విజయలక్ష్మి ఈనెల 21న పురుగుల మందు సేవించింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం విజయలక్ష్మి మృతి చెందింది. విజయలక్ష్మి పెద్దకుమారుడు మోహన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

● ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్

మరిపెడ రూరల్, జూన్ 23 : వివిధ గ్రామాలలో శిథిలావస్థలో ఉన్న దేవాలయాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నాడని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు, రాష్ట్ర నాయకుడు ప్రసాదరెడ్డి అన్నారు. ఆదివారం మూలమర్రి తండా జీపీ పరిధిలోని తోప్లాతండాలో ముత్యాలమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవం ఆలయ చైర్మన్, ఈఈ భూక్యా రాములు-జానకి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా తానంచర్ల పాలేరు వాగువద్ద నుంచి గిరిజన మహిళలు కోలాటాలు, తోప్లా తండాలో ఉన్న ముత్యాలమ్మ దేవాలయం వరకు ఊరేగింపుతో ఎమ్మెల్యే, రాష్ట్ర నాయకుడు ప్రసాదరెడ్డిని తీసుకవెళ్లారు. హోమం, ముత్యాలమ్మ తల్లికి వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముత్యాలమ్మ తల్లి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పల్లెల్లో ఉన్న దేవాలయాలు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో వర్ధిల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో పానుగోతు రాంలాల్, కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లీ రఘు వీరారెడ్డి, పాశం నరేష్‌రెడ్డి, నల్లు శ్రీకాంత్‌రెడ్డి, భూక్యా వెంకన్న, లింగ్యా, గుగులోతు రమేష్, తేజావత్ నెహ్రూనాయక్, భరత్‌నాయక్, ధరావత్ రవి, తేజావత్ చీట్యా, పూజారి బానోతు రాములు, వాంకుడోతు రవి, వాంకుడోతు నాగు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



తోప్లా తండాలో బోనం ఎత్తుకున్న రామచంద్రునాయక్

మానుకోట డీఎస్పీ జితేందర్‌కి సేవా పతకం



మహబూబాబాద్ రూరల్, జూన్ 23 : మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు రాష్ట్ర స్థాయి సేవా పతకానికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సెక్రటరీ డిఆర్. జితేందర్ ఆదివారం ప్రకటించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీస్‌శాఖలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు అవార్డులను అందిస్తారు. అందులో భాగంగా ఆగస్టు 15న మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావుకు సైబరాబాద్ ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ విభాగంలో సేవా పతకం అందించనున్నారు.

'అటవీ భూముని కాపాడాలి'

గూడూరు, జూన్ 23 : గూడూరు అటవీశాఖ రేంజ్ పరిధిలోని మర్రిమిట్ట సెక్షన్, బీట్ పరిధిలో అటవీ భూములను కాపాడాలని వెంగంపేట మాజీ సర్పంచ్ కట్ల భవానివిష్ణు డిమాండ్ చేశారు. 1037 కాంపార్ట్‌మెంట్ నెంబర్‌లో నరికి వేతకు గురైన చెట్లను ఆదివారం గ్రామస్తులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భవానివిష్ణు మాట్లాడుతూ కంపార్ట్‌మెంట్ నెంబర్ 1037లో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అటవీప్రాంతంలో ఉన్న వేప, మల్బరివేప, ఇతర జాతులకు చెందిన చెట్లను నరికి వేశారని పేర్కొన్నారు. అటవీ అధికారులు అక్కడికి చేరుకునే లోపే పారిపోయారన్నారు. ఇట్టి అటవీ భూములు అక్రమణ గురికాకుండ అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అటవీలో పశుపక్షాజుల సంచారం ఉంటుందన్నారు. పోడు కోసం అటవీని నరికితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. గత కొన్నేళ్ల నుంచి వెంగంపేట గ్రామస్తులు ఈ అటవీ భూముని కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. అదే భూమిని కబ్జా చేయాలని ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఉపసర్పంచ్ బొమ్మగాని దుర్గయ్య, కుమారస్వామి, రాఘవరెడ్డి, ఈర్య నాయక్, లింగయ్యవెంకన్న, యాదగిరి, భద్రు, దంజా, భూమ్లా, రవి, రమేష్ పాల్గొన్నారు.



మర్రిమిట్ట బీట్ అటవీప్రాంతంలో నరికి వేసిన చెట్లను పరిశీలిస్తున్న వెంగంపేట మాజీ సర్పంచ్ భవాణివిష్ణు

'విశ్వసమాజం సభను జయప్రదం చేయండి'

మహబూబాబాద్ టౌన్, జూన్ 23 : వరంగల్‌లో ఈనెల 30న జరుపతలపెట్టిన విశ్వసమాజం ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి లింగంపల్లి దయానంద్, తెలంగాణ పీపుల్స్ జేఏసీ జిల్లా కన్వీనర్ మామిడాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌సెంటర్‌లో విశ్వసమాజం ఆవిర్భావ సభ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించి, మాట్లాడారు. ప్రకృతివాదులు, కవులు, కళాకారులు, మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. విశ్వసమాజం వ్యవస్థాపకుడు విశ్వ జంపాల, నేపా అధ్యక్షుడు వై.కృష్ణప్రసాద్, వేముల రవీందర్, బాజ సైదులు, భూక్య సత్యనారాయణ, రాధాకృష్ణ, శ్రీను, బ్రహ్మాచారి, రంజిత్ కుమార్, ఇరుగుమనోజ్, రాజు, సాంబశివరావు, మహేష్, సతీష్, నగేష్, కుమార్, అనిల్, జావిద్, హమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



విశ్వసమాజం ఆవిర్భావ సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక, తెలంగాణ పీపుల్స్ జేఏపీ నేతలు

రేపు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశానికి ఎంపిక

మరిపెడ, జూన్ 23 : 2024-25 సంవత్సరానికి హైదరాబాద్ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశ ఎంపీక పోటీలను ఈనెల 25న మరిపెడ హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో పూల్‌చంద్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన 3వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు, విద్యార్థినులు 01-09-2015 నుంచి 31-08-2016 మధ్య కాలంలో జన్మించిన వారే ఈఎంపిక పోటీలకు అర్హులని పేర్కొన్నారు. ఉదయం 10గంటల వరకు మరిపెడ క్రీడా ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. మండల స్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులకు ఈనెల29 జిల్లాస్థాయి పోటీలు ఉంటాయన్నారు. ఎంఈవో వెంట జిల్లా యువజన క్రీడల అధికారి బి.అనిల్ ఉన్నారు.

● చిన్నగూడూరు : 2024-25 సంవత్సరాలకు గాను హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ 4వ తరగతి ప్రవేశాలకు ఈనెల 25న మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆదివారం మండల విద్యాశాఖ అధికారి బి.పూల్‌చంద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29న మహబూబాబాద్‌ఎన్‌టీఆర్ స్టేడియంలో జరుగు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

తొర్రూరు, జూన్ 23 : పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బసనబోయిన మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు పెదగాని సోమయ్య పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణగౌడ్, కిషన్ యాదవ్, బి.కుమార్ ఉన్నారు.

కొబ్బరికాయలు, తలనీలాల వేలం పాట

కొత్తగూడ, జూన్ 23 : వరంగల్‌లోని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో జూలై 3న కొత్తగూడ మండలం శ్రీగుంజేడు ముసలమ్మ జాతరలో కొబ్బరికాయలు, ఫోటోలు, పూజసామగ్రి విక్రయించుకునే, తలనీలాల సేకరించుకునే వేలంపాటలు నిర్వహిస్తున్నట్టు ఈవో భిక్షమాచారి తెలిపారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ జాతరలో కొబ్బరికాయలు, ఫోటోలు, పూజసామగ్రి అమ్ముకునే హక్కు, తలనీలాలు సేకరించుకునే హక్కు కోసవేలం పాటలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు జూలై 1న గుంజేడులోని శ్రీముసలమ్మ జాతరలో టెండర్ ఫారంలు తీసుకోవాలని సూచించారు. 3న వరంగల్‌లోని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

'మనోధైర్యంతో ముందుకెళ్లాలి'

చిన్నగూడూరు, జూన్ 23 : వితంతువులు మనోధైర్యంతో ముందుకెళ్లాలని బాలవికాస సంస్థ మండల కో-ఆర్డినేటర్ గంధసిరి ఉపేంద్ర అన్నారు. ఆదివారం ఉగ్గంపల్లిలో బాలవికాస ఆధ్వర్యంలో అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వితంతువుల పట్ల వివక్షతను రూపుమాపాలని, వారిని తోటి మహిళలతో సమాన గౌరవం ఇవ్వాలని అన్నారు. ఎంపీటీసీ ఉదయమ్మ, జూజ్జురి ఉపేంద్ర, డొంకెన ఉపేంద్ర, మహిళలు పాల్గొన్నారు.



ఉగ్గంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల షురూ

● హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, జూన్ 23 : కేసముద్రం మండలం అమినాపురం శ్రీభూనీళా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ హాజరు కాగా, ఆయనకు పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణ, అంకురారోహణం, తీర్థప్రసాద గోష్ఠి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

1న హైదరాబాద్‌కు తరలిరావాలి

నెహ్రూసెంటర్, జూన్ 23 : లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) 27వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూలై 1న హైదరాబాద్‌లో నిర్వహించే బంజార ఆత్మీయ సమ్మేళనానికి భారీగా తరలిరావాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గుగులోతు వెంకట్‌నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోడ సేవ్యనాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని ఏటిగడ్డతండ, కంకరమిల్లుతండ, సుందరయ్యతండలో ఆదివారం ఇంటింటికి తిరుగుతూ ప్రచారంనిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల నుంచి బంజార సమ్మేళనానికి హాజరవుతున్నారని చెప్పారు. ఈ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. గిరిజనులు జాతి ఐక్యతను చాటుతూ.. ప్రతి ఒక్కరు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోడ రామునాయక్, తేజావత్ శంకర్‌నాయక్, బానోత్ సుక్కి, గుగులోతు ఆకాలి, బోడ సోన, బోడ అచ్చాలి పాల్గొన్నారు.

హామీలను అమలు చేయడమే ప్రభుత్వం లక్ష్యం

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధనియాకుల రామారావు

గార్ల, జూన్ 23 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని మండల అధ్యక్షుడు ధనియాకుల రామారావు అన్నారు. ఆదివారం స్థానిక వర్తక సంఘం భవనంలో రూ. 2లక్షల రుణమాఫీని చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసినఅభినందన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతభారమైనగాని ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీని అమలు చేయడం అభినందనీయమన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందాలని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రుణమాఫీ పథకంపై అనేక విమర్శలు చేసి రైతులను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసిన ప్రజలు కాంగ్రెస్ పక్షాన నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో గంగావత్ రాంసింగ్ నాయక్, గుండా వెంకట్‌రెడ్డి, యాకుబ్‌పాష, హరి వెంకటేశ్వర్లు, చింతల కొండల్‌రావు, గుడిమెట్ల నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

బొజ్జన్నపేటలో వనభోజనాల సందడి

నర్సింహులపేట, జూన్ 23 : మండలంలోని బొజ్జన్నపేటలో ఆదివారం వనభోజనాల సందడి నెలకొన్నది. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు విత్తిన అనంతరం గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు సామూహిక వనభోజనాలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తున్నది. దీనిలో భాగంగా కులాలకు అతీతంగా గ్రామస్తులందరూ గ్రామ శివారు మెట్టు గుట్టకు వనభోజనాలకు వెళ్లి వంటలు చేశారు. చిన్నా, పెద్ద తేడాలేకుండా సామూహికంగా భోజనాలు చేశారు. అనంతరం మహిళలందరూ ఒక్కదగ్గరకు చేరి కోలాటం వేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు అధికంగా పండాలని వరుణదేవునికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

శేరిపురంలో ఆదివాసీలు..

● గార్ల : మండలంలోని శేరిపురంలో ఆదివారం ఆదివాసీలు వనభోజనాలకు వెళ్లారు. గ్రామంలో కుల దేవతలతకు ప్రత్యేక పూజలు జరిపి ప్రతీ ఇంటి నుంచి మహిళలు బోనాలు ఎత్తుకుని గ్రామశివారులో చెట్లకింద కుటుంబసభ్యులతో కలిసి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా వన భోజనాల ప్రదేశంలో ఆదివాసీ దేవతలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిగట రమణ, జిగట వెంకన్న, వట్టం వెంకన్న, సక్కుబాయి పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి : బీజేపీ

మహబూబాబాద్ రూరల్, జూన్ 23 : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు చుక్కల నరేష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ పిలుపు మేరకు ఆదివారం ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా జిల్లాకేంద్రంలోని గంగపుత్రసంఘం భవనం వద్ద మొక్కను నాటారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ మానవాళికి చెట్లు ఎంతో ముఖ్యమని, అందరు మొక్కలు నాటాలని సూచించారు. వెంకటప్పయ్య, అనిల్, పరమేశ్వర్, సునీల్, కృష్ణ పాల్గొన్నారు.

లంబాడి ఐక్యవేదిక నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ప్రవీణ్‌నాయక్

మరిపెడ రూరల్, జూన్ 23 : లంబాడి ఐక్యవేదిక డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మండలంలోని యలమంచిలి తండా జీపీకి చెందిన భూక్యా ప్రవీణ్‌నాయక్‌ను నియమించినట్లు రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ గుగులోతు రమేష్ నాయక్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌నాయక్ మాట్లాడారు. గిరిజన జాతి అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్, కో-ఆర్డినేటర్ రమేష్‌నాయక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దీకొండ ఐలయ్య సేవలు అభినందనీయం

ఇనుగుర్తి, జూన్ 23 : ఇనుగుర్తి మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ దీకొండ ఐలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గౌడ కౌండిన్య సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా గౌడ కౌండిన్య సంక్షేమ సంఘం అధ్యక్షులు కూటికంటి మధు మాట్లాడుతూ.. దీకొండ ఐలయ్య ఎంతోమంది పేద కుటుంబాలకు సాయం చేశారని చెప్పారు. మచ్చలేని రాజకీయ నాయకుడిగా పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, సతీష్, అశోక్, శ్రీనివాస్, అజయ్, శ్రీకాంత్, కిరణ్, వీరేష్, మధు, ప్రవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సూదనపల్లిలో స్వామిజీ శ్రీనారాయణ్ నంద్‌గిరి పూజలు

కురవి, జూన్ 23 : కిసాన్ పరివార్ అధినేత భూపాల్‌నాయక్‌కు చెందిన ఫాంహౌజ్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రముఖ స్వామిజీ, సనాతన ధర్మ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనారాయణ్ నంద్‌గిరి ఆదివారం పూజలు నిర్వహించారు. భూపాల్‌నాయక్ ఆహ్వానం మేరకు ఫాంహౌస్‌కు వచ్చిన నారాయణ్‌నంద్ గిరి భూపాల్‌నాయక్ అనుచరులతో సమావేశమయ్యారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమానాయక్, మూడ్ బాలుచౌహాన్, జె.రంగన్నగౌడ్, విష్ణు, ఎడెల్లి వెంకన్న పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర పెంపు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 23 :కేంద్రప్రభుత్వం 14 రకాల పంటలకు కనీస మద్దతు (ఎంఎస్‌పీ) ధరను పెంచింది. ఈ నెల 19న కేంద్ర క్యాబినెట్‌లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వరి, జొన్న, పత్తి పంటలకు, ఇతర పంటలకు కనీస మద్దతు ధర పెంచింది. వరికి గతేడాదితో పోలిస్తే రూ.117 పెరిగింది.

పంటలు	పెరిగిన ధర
వరి (ఏ-గ్రేడ్)	రూ.2320
వరి (కామన్‌రకం)	రూ.2300
జొన్న (హైబ్రిడ్)	రూ.3371
మాల్దండి	రూ.3421
పత్తి (మధ్యరకం)	రూ.7121
పత్తి (పొడుగు గింజ)	రూ.7521
సజ్జలు	రూ.2625
రాగులు	రూ.4290
కందులు	రూ.7550
పెసర్లు	రూ.8682
మినుములు	రూ.7400
వేరుశనగ	రూ.6783
పొద్దుతిరుగుడు	రూ.7280
సోయాబీన్ (ఎల్లో)	రూ.4892
నువ్వులు	రూ.9267

పంచాయతీలకు అడ్డాగా ప్రభుత్వ పాఠశాల

తొర్రూరు, జూన్ 23 : పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పంచాయతీలకు అడ్డాగా మారిపోతుంది. మండలంలోని ఏ గ్రామంలో ఏ సమస్య ఉన్నా చర్చించుకోవడానికి, పెద్దమనుషులు తీర్మానం చేసుకునేందుకు తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అడ్డాగా మారింది. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన పాఠశాలలో పంచాయతీలు, గొడవలు జరుగుతుంటే అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, పాఠశాల హెచ్‌ఎం పట్టించుకోకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పాఠశాల కాంప్లెక్స్ వ్యాపారులు పాఠశాలలోనే మలమూత్ర విసర్జన చేయడంతో క్రీడాకారులు, వయోవృద్ధులు ఉదయం, సాయంకాలం వాకింగ్ చేసే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం పాఠశాలలో ఓ గ్రామానికి సంబంధించిన భూ సమస్య పరిష్కారానికి ఇరు వర్గాలు పాఠశాల ఆవరణలో గొడవపడడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సంబంధిత పాఠశాల యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అగ్నిమాపక కేంద్రం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

● ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి కంచె వెంకన్న

గూడూరు, జూన్ 23 : గూడూరు ఏజెన్సీ మండలకేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి కంచె వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు మండల కేంద్రంలోని కొమురంభీమ్ విగ్రహం ఎదుట ఆదివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ మండలంలో విద్యార్థులు ఇంటర్ తర్వాత డిగ్రీ కోసం నర్సంపేట, మహబూబాబాద్ సుదూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. వేసవి కాలంలో అగ్నిప్రమాదాలు సంభవించి ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని, ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వెంటనే గూడూరులో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్, మండల కార్యదర్శి బండెల వీరస్వామి, కటకం బుచ్చిరామయ్య, బాదావత్ రమేష్ పాల్గొన్నారు.

మానుకోటలో జూవెలరీ షాపులో చోరీ

● మూడు కేజీల వెండి అభరణాలు అపహరణ

మహబూబాబాద్ రూరల్, జూన్ 23 : జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న అయ్యప్ప జూవెలరీషాపులో చోరీ జరిగి 3 కేజీల వెండి అభరణాలు అపహరణకు గురైనట్లు షాపు యాజమాని అరుణ్‌వాల్ భన్సీలాల్ తెలిపారు. బాధితుడి కథనం ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బలపాల శివారు లింగ్యాతండాకు చెందిన భన్సీలాల్ గత కొన్ని సంవత్సరాల క్రితం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బెస్తబజారులో నివాసముంటూ రైల్వేస్టేషన్ సమీపంలో జూవెలరీషాపు పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం భన్సీలాల్ భార్య పద్మకు ఆపరేషన్ ఉండగా సాయంత్రం షాపు బంద్ చేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం సాయంత్రం షాపుకు వెళ్లి చూసే సరికి పైకప్పులో ఉన్న పెంకులు తీసి ఉండడంతో అనుమానంతో లోనికి వెళ్లి చూశాడు. ఇంటి పైకప్పు నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు షాపులో ఉన్న మూడు తులాల వెండి అభరణాలు అపహరించుకుపోయినట్లు చెప్పారు. వాటి విలువ సుమారు రూ.2.55 లక్షలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్‌ను వివరణ కోరగా చోరీ జరిగింది వాస్తవమేనని, వారు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని చెప్పారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 23 : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక అన్నారు. జిల్లా కేంద్రం శివారు ముత్యాలమ్మగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు చదువుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థినీలకు సూచించారు. లక్ష్యాన్ని ఎంచుకొని ప్రణాళికయుతంగా చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సరఫరా, నిరోధం మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు దాసరి నాగేశ్వర్‌రావు, మోహన్, కాసాని మౌనిక, వార్డెన్ జయసుధ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక